క్లుప్తంగా

రేపు ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత జబ్బులకు వైద్య చికిత్సలు అందిస్తారని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. గుండె జబ్బుల సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ఇసీ దినేష్‌రెడ్డి తెలిపారు. అలాగే దినేష్ మెడికల్ సెంటర్‌లో నూతనంగా డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించామని, కిడ్నీ సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ఆటోకార్మికుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఆటో కార్మికులు

జమ్మలమడుగు : పాతబస్టాండ్‌లోని ఆటో స్టాండ్ వద్ద ఆటోలను నిలుపకుండా గుంతలు కొట్టడం అన్యాయమని సీఐటీయూ, సీపీఎం నాయకుడు ఏసుదాసు తెలిపారు. శుక్రవారం స్థానిక పాత బస్టాండ్ వద్ద ఆటో స్టాండ్ లేకుండా చేయడంతో కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 30 సంవత్సరాల నుంచి ఆటో స్టాండ్ పాతబస్టాండ్‌లో ఏర్పాటు చేసుకోవడంతోపాటు మున్సిపల్ అభివృద్ధి కోసం టోల్‌గేట్ కూడా చెల్లించడం జరుగుతుంది. ఈ ఆటో స్టాండ్ వంద మంది కార్మికులకు ఆధారమైందన్నారు. ఆటోస్టాండ్‌కు ఈ స్థలాన్ని కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైలవరం, వేపరాల ఆటో కార్మికులు పాల్గొన్నారు.

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు



అమ్మవారికి సారె సమర్పించటానికి వస్తున్న భక్తులు

జమ్మలమడుగు : ఎర్రగుంట్ల పట్టణంలోని ఏరువాక గంగమ్మతల్లికి భక్తులు చీరె, సారెలను అందించారు. శుక్రవారం గంగమ్మతల్లి దేవాలయం వద్ద నుంచి భారీ స్థాయిలో భక్తులు అమ్మవారికి బోనాలు, సారె పట్టుకుని ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు.

ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలి



నీటి తొట్లలో అబైట్ ద్రావణాన్ని పిచికారి చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

పులివెందుల రూరల్ : ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య తెలిపారు. శుక్రవారం పట్టణంలోని నగరిగుట్ట, రాజారెడ్డి కాలనీలలో డెంగీ మాసోత్సవం, ఫ్రై డే డ్రైడే కార్యక్రమాల సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్ధయ్య మాట్లాడుతూ మలేరియా, డెంగీ వంటి వ్యాధులు దోమల ద్వారా వ్యాపిస్తాయన్నారు. దోమల నివారణ పద్ధతులు, ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించామన్నారు. అనంతరం దోమల నివారణ కొరకు నీటి నిల్వ ఉన్న తొట్లలో అబైట్ ద్రావణాన్ని పిచికారి చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు శేషగిరి, నాయక్, లక్ష్మి, స్వర్ణ, ఆశా కార్యకర్త, ఛాయదేవి తదితరులు పాల్గొన్నారు.

విత్తన మిని కిట్లను సద్వినియోగం చేసుకోవాలి



తాగునీటి పథకానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

కొండాపురం : మండలంలోని రైతులు విత్తన మినికిట్లను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ సి.ఆదినారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం ఏటూరు చిత్రావతి వంతెన సమీపంలో తాగునీటి పథకాల పనులకు ఆయన భూమిపూజ చేసి మాట్లాడారు. దత్తాపురం, తాళ్లప్రొద్దుటూరు, కొండాపురం, ఓబన్నపేట గ్రామ పంచాయతీలకు ఆర్అండ్ఆర్ కాలనీల్లో తాగునీటి సమస్య లేకుండా చేయడానికి రూ.7 కోట్లతో పనులు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జేడీ చంద్రనాయక్, ఎంపీడీఓ నాగప్రసాదు, తహసీల్దార్ గురప్ప, ఎఓ రామాంజులరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈ హరీష్, ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

తెరుచుకోని హోమియో వైద్యశాల

● ఇబ్బందులు పడుతున్న రోగులు



కమలాపురంలో తెరుచుకోని హోమియో వైద్యశాల

కమలాపురం : కమలాపురం మండలంతో పాటు సమీప మండలాలకు చెందిన ప్రజలకు హోమియో వైద్యం దూరం అయింది. ఇక్కడ డిప్యూటేషన్‌పై వైద్య సేవలు అందిస్తున్న హోమియో వైద్యులు షాకీర్ హుసేన్ బదిలీపై కడపకు వెళ్లారు. దీంతో మూడు వారాలుగా హోమియో వైద్యశాల తెరుచుకోలేదు. కమలాపురం మండలంతో పాటు వల్లూరు, ఖాజీపేట, చాపాడు, ఎర్రగుంట్ల మండలాలకు చెందిన రోగులు రోజూ వైద్యశాలకు వచ్చి వెనుదిరుగుతున్నారు. నియోజకవర్గ కేంద్రమైన కమలాపురంలో హోమియో వైద్యుడిని నియమించక పోతే ఏలా? అని రోగులు ప్రశ్నిస్తున్నారు. రెగ్యులర్ హోమియో వైద్యుడిని నియమించడం లేదా గతంలో పనిచేసిన వైద్యుడినే డిప్యూటేషన్ పద్ధతిలో నియమించాలని హోమియో రోగులు కోరుతున్నారు.

హోమియో వైద్యానికి ప్రత్యేక ఆదరణ

హోమియో వైద్యానికి ప్రత్యేక ఆదరణ ఉంది. కమలాపురంలో రెగ్యులర్‌గా, డిప్యూటేషన్ పనిచేసిన హోమియో వైద్యులు షాకీర్‌హుసేన్ కమలాపురంతో పాటు అన్ని గ్రామాల్లో, పాఠశాలల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో, గురుకులాల్లో హోమియో వైద్య శిబిరాలు నిర్వహించి అన్ని రోగాలకు హోమియో వైద్య సేవలు అందించి వైద్యంపై ప్రజలకు మంచి అవగాహన కల్పించారు. అన్ని రకాల దీర్ఘ కాలిక రోగాలైన మోకాళ్ల నొప్పులు, కిడ్నీ సమస్యలతో పాటు టైఫాయిడ్, మలేరియా, చికన్ గున్యా తదితర రోగాలకు మందులు అందజేసేవారు. అలాగే పాఠశాలలో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తగా ప్రివెంటివ్ మెడిసిన్ అందించేవారు. ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ లేని వైద్యం కావడంతో అన్ని వర్గాల ప్రజలు దీనిని ఆదరించారు. దీంతో ప్రతి రోజు కనీసం 80–100 మంది రోగులు ప్రభుత్వ వైద్యశాలకు వచ్చి వైద్య సేవలు పొందేవారు.



కమలాపురం వికలాంగుల కాలనీలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న హోమియో వైద్యులు షాకీర్ హుసేన్(ఫైల్)

మూడేళ్లుగా పోస్టు ఖాళీ

హోమియో వైద్యానికి ఇంత ఆదరణ ఉన్నప్పటికి గత మూడేళ్లుగా కమలాపురంలో హోమియో పోస్టు ఖాళీగానే ఉన్నది. సీకేదిన్నె హోమియో వైద్యులుగా ఉన్న షాకీర్ హుసేన్‌ను అప్పటి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ప్రజల ఫిర్యాదు మేరకు కమలాపురంలో మూడు రోజులు విధులు నిర్వహించేలా ఉన్నతాధికారులతో చర్చించి డిప్యూటేషన్ వేయించారు. దీంతో ప్రతి మంగళ, గురు, శనివారాలలో హోమియో వైద్యశాల ఉండేది. అప్పుడు రోగులు దాదాపు 80 మందికి పైగానే వైద్య సేవలు పొందేవారు. ప్రస్తుతం ఉన్నతాధికారులు స్పందించి కమలాపురం హోమియో డాక్టర్ పోస్టును భర్తీ చేయాలని, లేని పక్షంలో గతంలో ఉన్న డాక్టర్‌నే ఇక్కడ డిప్యూటేషన్ వేయాలని పట్టణ ప్రజలు, హోమియో రోగులు కోరుతున్నారు.

హోమియో వైద్యుని పోస్టు భర్తీ చేయాలి



హోమియో వైద్యం పొందడంతో నాకు కిడ్నీలో ఉన్న రాయి బయటికి వచ్చింది. ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్‌లేని హోమియో వైద్యం ప్రజలందరికి అవసరం. నియోజకవర్గ కేంద్రమైన కమలాపురంలో హోమియో వైద్యుని పోస్టు భర్తీ చేయక పోవడం దారుణం. తక్షణం పోస్టు భర్తీ చేయాలి. లేని పక్షంలో గతంలో ఉన్న డాక్టర్‌నే డిప్యూటేషన్ పై నియమించాలి.

–జి. సుబ్బరాయుడు, కమలాపురం

హోమియో వైద్యం అద్భుతం



హోమియో వైద్యం అద్భుతం.. కమలాపురం మండలంతో పాటు ఇతర మండలాల రోగులు కూడా కమలాపురం హోమియో వైద్యశాలకు వచ్చి వైద్య సేవలు పొందుతుంటారు. మానసిక రోగాలకు కూడా హోమియో మందులు బాగా పని చేస్తున్నాయి. గత మూడు వారాలుగా హోమియో వైద్యశాల తెరవడం లేదు. డాక్టర్‌ను ఇంకా నియమించలేదు.

–బి.వెంకటసుబ్బారెడ్డి(చిన్ని), పెద్దచెప్పలి, కమలాపురం

ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

ముద్దనూరు : ముద్దనూరు–తాడిపత్రి జాతీయ రహదారి ఉమ్మారెడ్డిపల్లె సమీపంలో శుక్రవారం గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధురాలికి తీవ్ర గాయాలయ్యాయి. ఉమ్మారెడ్డిపల్లెకు చెందిన దేవమ్మ రోడ్డు దాటుతుండగా వాహనం ఢీకొంది. ఆమెను 108 వాహనంలో ప్రొద్దుటూరుకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడినుంచి కర్నూలుకు తరలించారు.

ముగిసిన భవాని పీరు ఉత్సవం



భవాని పీరును ఊరేగింపుగా తీసుకెళుతున్న భక్తులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయ సమీపంలో వెలసిన భవాని పీరు ఉత్సవం శుక్రవారం నాటితో ముగిసింది. పీరును అగ్ని గుండ ప్రవేశం చేసి పట్టణ పురవీధులలో ఊరేగించారు. భక్తులు వెండి గొడుగులు, చక్కెర చదివింపులు ఇచ్చారు. అనంతరం పీరును జల్దీకి తరలించారు. పీర్ల ఉత్సవాలను హిందు, ముస్లింలు ఉత్సాహంగా జరుపుకున్నారు.

జనాభా నియంత్రణతో దేశాభివృద్ధి

పులివెందుల : జనాభా నియంత్రణతో సత్వర దేశాభివృద్ధి జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా అభివృద్ధి దేశాభివృద్ధికి ఆటంకం కాకూడదన్నారు. వేంపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు బాలకొండు గంగాధర్, అధ్యాపకులు బాల నారాయణలు మాట్లాడుతూ దేశాభివృద్ధి యువత చేతిలో ఉందని, జనాభాలో యువతే ప్రముఖ పాత్ర వహించాలన్నారు. అంతకముందు కళాశాల ఆవరణలో వారు మొక్కలు నాటి పర్యావరణ ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



పులివెందులలో మాట్లాడుతున్న చరిత్ర అధ్యాపకుడు బాలకొండు గంగాధర్

వేంపల్లెలో..

వేంపల్లె : జనాభా పెరగడంవలన సహజ వనరుల కొరత ఉంటుందని, కుటుంబ నియంత్రణను ప్రతి ఒక్కరూ పాటించాలని డాక్టర్ పృథ్వీకుమార్ రెడ్డి తెలిపారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా మండలంలోని వేంపల్లె పరిధిలోని శుక్రవారం వేంపల్లె కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు వైద్య ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు సుభాషిణి, శాంతి, నిహారిక, సీహెచ్ఓ వెంకటరత్నం, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ షఫీవున్నీషా బేగం, ఎంపీహెచ్ఈఓ ఫక్రుద్దీన్, సూపర్‌వైజర్ అరుణా దేవి, సీహెచ్ఓలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తొండూరులో..

తొండూరు : సరైన ప్రణాళిక ఉంటే జనాభా ఒక వరమని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మల్లయ్య తెలిపారు. శుక్రవారం స్థానిక జెడ్పీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెడ్మాస్టర్ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ హాజరై మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాలు తేడాలను రూపుమాపి పెరుగుతున్న జనాభాను అభివృద్ధివైపు పురోగమించాలన్నారు. అనంతరం మానవహారం ద్వారా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



తొండూరులో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఉపాధ్యాయులు

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు రూరల్ : ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ రఫీక్ పాషా మాట్లాడుతూ చిన్న వయస్సులో వివాహాలు చేసిన మహిళల్లో అనేక మంది అనారోగ్యానికి గురైయ్యారన్నారు. తల్లిదండ్రులు 18 సంవత్సరాలు నిండిన బాలికలకు మాత్రమే వివాహం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, ఎఎన్ఎంలు, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

కమలాపురం : వ్యవసాయ సిబ్బంది నిత్యం రైతులకు అందుబాటులో ఉండాలని జేడీఏ చంద్రనాయక్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఏడీఏ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని వ్యవసాయ సిబ్బందితో రివ్యూ సమావేశం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని కమలాపురం, వల్లూరు, వీఎన్‌పల్లె, ఎర్రగుంట్ల మండలాల ఏఓలతో పంటల సాగు, అవసరమైన ఎరువులు తదితర అంశాలపై ఆరా తీశారు. అనంతరం ఆర్ఎస్‌కే సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యవసాయ శాఖలోని పథకాల గురించి అవగాహన కల్పించారు. ఈ పథకాల గురించి రైతులకు తెలియజేయాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్ఎస్‌కే సిబ్బంది నిత్యం తమ పరిధిలోని రైతులకు అందుబాటులో ఉండి వారికి అవసరమైన సలహాలు సూచనలు అందజేయాలన్నారు. ముఖ్యంగా అన్నదాత సుఖీభవ అర్హుల జాబితా తప్పని సరిగా సోషల్ ఆడిట్ కొరకు ఆర్ఎస్‌కేలలో ఉంచాలన్నారు. జాబితాలో పేరు లేని రైతులు వీఏఏలను సంప్రదించి గ్రీవెన్స్ అందజేయాలన్నారు. ఎంపీ కిసాన్ రైతులు వారికి అకౌంట్‌కు ఎన్‌పీసీఐ లింక్ చేసుకోవాలని సూచించారు. పొలం పిలుస్తోంది... కార్యక్రమాన్ని ప్రతి మంగళ, బుధవారాలలో తప్పని సరిగా చేయాలన్నారు. కార్యక్రమాలకు రైతులకు తప్పని సరిగా ఆహ్వానించాలన్నారు. ఆర్ఎస్‌కే సిబ్బంది తప్పనిసరిగా పంట పొలాలను సందర్శించి రైతులకు తగిన సలహాలు, సూచనలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ నరసింహారెడ్డి, ఏఓలు సరస్వతి, శ్యాంబాబు, సుజన కుమారి, కిరణ్‌కుమార్‌రెడ్డి, వీఏఏలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేడీఏ చంద్రనాయక్

జమ్మలమడుగులో స్టాపింగ్ ఏర్పాటు చేయాలి

జమ్మలమడుగు : తిరుపతి–గుంటూరు రైలు స్టాపింగ్‌ను జమ్మలమడుగులో శాశ్వితంగా ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు ప్రసాద్, పట్టణ ఉపాధ్యక్షుడు ప్రసాద్, సుభహాన్‌లు తెలిపారు. శుక్రవారం స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. తిరుపతి–గుంటూరుకు వెళ్లే రైలుకు కొద్ది రోజుల వరకు స్టాపింగ్ ఏర్పాటు చేశారు. అయితే రైల్వే అధికారులు ఇప్పుడు తిరుపతి–గుంటూరు రైలుకు జమ్మలమడుగులో స్టాపింగ్ లేదని డిస్‌ప్లే ప్రదర్శిస్తున్నారు. ప్రస్తుతం ధర్మవరం–విజయవాడ రైలు ఒక్కటే దిక్కు అవుతుంది. ప్రస్తుతం నాదేండ్–తిరుపతి రైలుకు స్టాపింగ్ ఉందని సంతోషపడేలోపు మరోరైలుకు ఇక్కడ స్టాపింగ్‌లేదని చెప్పడం బాధాకరం అన్నారు. ఉన్నతాధికారులు గుంటూరు–తిరుపతి రైలు జమ్మలమడుగు స్టేషన్‌లో ఆగేవిధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ సబ్సిడీతో ఆయిల్‌ఫాం పంట సాగు

లింగాల : ఆయిల్ ఫాం పంట సాగు చేసేందుకు రైతులకు ఉద్యాన శాఖ మొక్కలతోపాటు ఒక హెక్టార్‌కు నాలుగేళ్ల పాటు మొక్కల యాజమాన్యం, అంతర పంట సాగుకు ఏడాదికి రూ.10,500లు సబ్సిడీ రూపంలో ఇవ్వడం జరుగుతుందని హెచ్ఓ రాఘవేంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని వెలిదండ్ల రైతు సేవా కేంద్రంలో రైతులకు ఆయిఫాం పంట సాగుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్ ఫాం పంట సాగుకు లింగాల మండలం అనుకూలంగా ఉంటుందన్నారు. రైతులకు ఎటువంటి సందేహం లేకుండా మొక్కలు నాటుకోవచ్చునని, భవిష్యత్‌లో నీరు కూడా పుష్కలంగా ఉండే రైతులు పంట సాగుకు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రమాదేవి, ఆగ్రోటిక్ కంపెనీ ప్రతినిధి మురళి, రైతు సేవా కేంద్ర సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హెచ్ఓ రాఘవేంద్రారెడ్డి

పంటల బీమా గురించి రైతులకు వివరించండి

పెండ్లిమర్రి : ఖరీఫ్ సీజన్‌లో పంట సాగు చేసిన రైతులు పంట బీమా ప్రీమియం చెల్లించే విధానం గురించి రైతులకు వివరించాలని వ్యవసాయాధికారి చీర్లసుమంత్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో రైతు సేవా కేంద్ర సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరటి, పత్తి, వేరుశనగ, చీని పంటలకు ఈనెల 15వ తేదీ కల్లా వాతావరణ ఆధారితంగా అమలు చేస్తున్న పంటలకు బీమాకు చేసుకోవాలన్నారు. త్వరలో పంట నమోదు కార్యక్రమం ప్రారంభవవుతుందన్నారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి రెడ్డయ్య, రైతు సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

కమలాపురం : మండలంలోని అన్ని సబ్ స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు ఏపీఎస్‌పీడీసీఎల్ ఏఈ చాంద్‌బాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరు మండల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ రామలింగారెడ్డి తెలిపారు.

జమ్మలమడుగు రూరల్ : పట్టణ, మండలాల్లో విద్యుత్ సరఫరాలో శనివారం అంతరాయం ఉంటుందని జమ్మలమడుగు ట్రాన్స్‌కో ఏడీ రాజగోపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జమ్మలమడుగు పట్టణం, మైలవరం, పెద్దముడియం, ముద్దనూరు, కొండాపురం మండలాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

సింహాద్రిపురం : మండలంలోని కోవరంగుంటపల్లె, అంకాలమ్మగూడూరు, జంగంరెడ్డిపల్లె, రావులకొలను విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ దినేష్‌కుమార్ తెలిపారు.

పులివెందుల రూరల్ : పట్టణంలోని పలు ప్రాంతాలు, మండలంలోని పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈలు జగదీశ్వరరెడ్డి, రమేష్‌లు తెలిపారు. పెద్దరంగాపురం, నల్లపురెడ్డిపల్లె, ఇ.కొత్తపల్లె, గోటూరు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలన్నారు.

క్రమశిక్షణతో చదవాలి



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

లింగాల : విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి కష్టపడి చదివి పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఉపాధ్యాయుడు మహేశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం కామసముద్రం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడు మహేశ్వరరెడ్డికి ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెడ్మాస్టర్ సుబ్రమణ్యం మహేశ్వరరెడ్డి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

22 నుంచి సీపీఐ జిల్లా మహాసభలు

కమలాపురం : పాలక ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలే లక్ష్యంగా జూలై 22 నుంచి 24 వరకు బద్వేల్‌లో జరిగే సీపీఐ జిల్లా మహా సభలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ముస్లిం కమ్యూనిటీ షాదిఖానలో జరిగిన సీపీఐ ఏరియా మహాసభలో ఆయన మాట్లాడారు. ఈ నెల 22 నుంచి 24 వరకు బద్వేల్‌లో జిల్లా మహా సభలు, ఆగస్టు 20 నుంచి 25 వరకు ఒంగోలులో రాష్ట్ర మహా సభలు, సెప్టెంబర్ 21 నుంచి 24 వరకు చండీఘర్‌లో జాతీయ మహాసభలు జరుగబోతున్నాయని ఆయన వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ఎండగట్టేందుకే జిల్లా, రాష్ట్ర, జాతీయ మహాసభలు నిర్వహిస్తున్నామని, సీపీఐ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సీపీఐ మహాసభలు విజయవంతం చేయాలని పిలుపునిస్తున్న సీపీఐ నాయకులు

రక్తదానం ప్రాణదానంతో సమానం

కమలాపురం : 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ప్రతి మూడు మాసాలకొకసారి రక్తదానం చేయాలని, రక్తదానం చేస్తే ప్రాణదానంతో సమానం అని స్టెప్ సీఈఓ సాయి గ్రేస్ తెలిపారు. కడప జిల్లా స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో చేపట్టిన ద్వితీయ వార్షిక రక్తదాన వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు 25 మంది రక్తదానం చేశారు. వారికి ఆమె ప్రశంసా పత్రాలు, జ్యూస్‌లు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండి 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ప్రతి మూడు మాసాలకొకసారి రక్తదానం చేయాలన్నారు. రక్తదానంపై అపోహలు వీడాలని, రక్తదానం చేస్తే పాత కణాలు పోయి కొత్త కణాలు ఉత్పత్తి అవుతాయని, తద్వారా మనుషులు చురుగ్గా ఉంటారన్నారు. రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానం అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఏ ల్యాబ్‌లో తయారు చేయలేనిది రక్తం మాత్రమేనన్నారు. అలాంటి రక్తాన్ని మనిషి మాత్రమే దానం చేయగలరన్నారు. ఒక రోజు రెండు రోజులు కాకుండా వారం రోజుల పాటు రక్తదాన శిబిరాలు నిర్వహించడం అభినందనీయం అని స్వచ్ఛంద సంస్థలను అభినందించారు. మదర్ థెరిసా సేవా సమితి ట్రస్ట్ అధ్యక్షుడు జూటూరు విజయ్‌కుమార్ మాట్లాడుతూ అమ్మ జన్మనిస్తే, రక్తదాత పునర్జన్మనిస్తాడన్నారు. ఇలాంటి పుణ్యకార్యాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేయడం వలన అనేక ఆరోగ్య లాభాలు ఉన్నాయన్నారు. యువత రక్తదానం కోసం నడుం బిగించాలన్నారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందిస్తున్న స్టెప్ సీఈఓ సాయిగ్రేస్

పసుపు పంటల సాగుపై శిక్షణ

చింతకొమ్మదిన్నె : పులివెందుల అరటి పరిశోధన స్థానం అధికారులు మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామంలో పసుపు పంటసాగుపై శుక్రవారం రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్త శివరామకృష్ణ, వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి బాలకృష్ణ, ఉద్యాన కళాశాల ప్రొఫెసర్ గిరిధర్, శాస్త్రవేత్తలు అరుణోదయ, సందీప్ నాయక్, రేష్మ, ఉద్యాన అధికారి జీవన్, వ్యవసాయ అధికారి ఈశ్వరరెడ్డి, రైతులు పాల్గొన్నారు.



పసుపు పొలంలో రైతులకు సూచనలిస్తున్న అధికారులు

రూ.2.54 కోట్లతో ఉపాధి పనులు

పులివెందుల రూరల్ : పులివెందుల ప్రాంతంలో రూ.2.54 కోట్లతో ఉపాధి పనులు చేసినట్లు ఉపాధి హామి పథకం పీడీ ఆదిశేషారెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఉపాధి హామీ పీడీ మాట్లాడుతూ 2024 నుంచి 2025 ఏప్రిల్ వరకు జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ నిర్వహించడం జరిగిందని, పులివెందుల మండలంలోని ఆరు పంచాయతీలలో 275 పనులకు సుమారు రూ.2.54 కోట్ల నిధులను ఖర్చు చేశారన్నారు. ఉపాధి హామీ పనులను గ్రామీణ ప్రాంతాలలో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పనులు చేయాలన్నారు. అధికారులు కూడా ఉపాధి హామి పనికి వచ్చే విధంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంపై గ్రామీణ ప్రాంతాల్లో పనులు కల్పించే విధంగా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఉపాధి హామీ సామాజిక తనిఖీ కార్యక్రమంలో అధికారులు

ఉత్సాహంగా క్రీడా పాఠశాల ఎంపికలు

కడప వైఎస్ఆర్ సర్కిల్: 2025–26 సంవత్సరంలో డాక్టర్ వైఎస్ఆర్ క్రీడా పాఠశాల 5వ తరగతి ప్రవేశాలకు శుక్రవారం ఎంపికలు ఉత్సాహంగా సాగాయి. ఈ సందర్భంగా జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కె. జగన్నాథరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు సామర్థ్యం పరీక్షలను నిర్వహించారు. ఆన్‌లైన్ ప్రకారం 51 మంది విద్యార్థులు అర్హులు కాగా వారిలో 36 మంది హాజరయ్యారు. అయితే మెడికల్ టెస్ట్ పరీక్షలో ఇద్దరిని తిరస్కరించారు. ఈ ఎంపికలకు 13 మంది విద్యార్థులు హాజరుకాలేదని క్రీడా శాఖ అధికారులు తెలిపారు. క్రీడా పాఠశాలకు ఎంపికలకు 5వ తరగతిలో హాజరైన వారికి ఎత్తు, బరువు, మెడికల్ టెస్ట్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, షాట్‌పుట్, 30 మీటర్ల ఫ్లెయింగ్ స్టార్ట్, రన్నింగ్ వంటి పరీక్షలను నిర్వహించారు. క్రీడా మైదానంలో ఎటువంటి సంఘటనలు జరగకుండా అధికారులు తగు ఏర్పాట్లు చేశారు.